# సాగు విస్తీర్ణం రెట్టింపు..

-మొదటిపేజీ తరువాయి

పేర్కొంది. అయితే సాగు విస్తీర్ణం భారీగా పెరిగినప్పటికీ వరి దిగుబడిలో తెలంగాణ ఇంకా మెరుగుపడాల్సి ఉందని సర్వే సూచించింది. పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్‌ల తో పోలిస్తే తెలంగాణలో ఎకరానికి వచ్చే దిగుబడి జాతీయ సగటు కంటే తక్కువగా ఉంది. అకాల వర్షాలు, వడగాడ్పులు అందుకు ప్రధాన కారణమని సర్వే తెలిపింది. వాతావరణాన్ని తట్టుకొనే విత్తనాలను వాడటం ద్వారా దీన్ని అధిగమించవచ్చుని సర్వే సూచించింది.
పీడీఎస్ ఆహార ధాన్యాల రవాణా వాహనాల కదలికలను రియల్‌టైమ్‌లో గుర్తించేందుకు కేంద్రం 'అన్న చక్ర' పేరుతో ప్రవేశపెట్టిన వెహికల్ లొకేషన్ ట్రాకింగ్ సిస్టమ్‌ను పూర్తిస్థాయిలో అమలు చేసిన ఆరు రాష్ట్రాల్లో తెలంగాణ కూడా ఒకటని సర్వే గుర్తించింది. భూ రికార్డుల నిర్వహణలోనూ తెలంగాణ ముందుందని.. రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలను అనుసంధానిస్తూ తీసుకొచ్చిన 'భూభారతి' పోర్టల్ (ధరణికి కొనసాగింపుగా/మార్పుగా) పారదర్శకతను పెంచిందని సర్వే అభిప్రాయపడింది.

**ద్రవ్యోల్బణం కట్టడి బహుబాగు..**

202526 ఆర్థిక సంవత్సరం (ఏప్రిల్‌డిసెంబర్) గణాంకాల ప్రకారం తెలంగాణలో రిటైల్ ద్రవ్యోల్బణం రేటు కేవలం 0.20 శాతంగా నమోదైంది. గత కొన్నేళ్లతో పోలిస్తే ఇది భారీగా తగ్గింది. దేశంలోని ప్రధాన రాష్ట్రాలన్నింటికంటే ఇదే అత్యల్పం కావడం విశేషం. జాతీయ స్థాయిలో ద్రవ్యోల్బణం సగటున 1.72 శాతంగా నమోదైంది. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో ద్రవ్యోల్బణం 1.39 శాతంగా ఉండగా కర్ణాటకలో 3.14 శాతంగా ఉంది. మరోవైపు సంపద సృష్టిలోనూ తెలంగాణ సత్తా చాటింది.

**సేవల రంగంలో టాప్‌గేర్**

ఐటీ, పారిశ్రామిక, మహిళా సంక్షేమ రంగాల్లోనూ తెలంగాణ తనదైన ముద్ర వేస్తోందని ఆర్థిక సర్వే వివరించింది. 'వికసిత్ భారత్'లో తెలంగాణది కీలకపాత్ర అని ఈ నివేదిక స్పష్టం చేసింది. ఐటీ, సేవల రంగంలో తెలంగాణ తన సత్తాను మరోసారి చాటుకుంది. దేశం మొత్తం మీద ఉత్పత్తి అవుతున్న సేవల రంగంలో దాదాపు 40 శాతం వాటా కేవలం నాలుగు రాష్ట్రాలదే కాగా అందులో మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడులతో కలిసి తెలంగాణ ఈ ఘనత సాధించింది.
అధిక ఉత్పాదకత, ఆధునిక ఐటీ సేవలు, ఫైనాన్స్ రంగాల్లో తెలంగాణ దూసుకుపోతోందని సర్వే ప్రశంసించింది. కృత్రిమ మేధ రంగంలో హైదరాబాద్ దూసుకుపోతోందని, దేశంలోని మొత్తం జెన్‌ఏఐ స్టార్టప్‌లలో 7 శాతం వాటాతో తెలంగాణ 4వ స్థానంలో నిలిచిందని సర్వే తెలిపింది. బెంగళూరు, ఢిల్లీ తర్వాత హైదరాబాద్ స్టార్టప్‌లకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది.

**మహిళా సాధికారతకు పెద్దపీట**

మహిళా భద్రత, ఉపాధి కల్పనలో తెలంగాణ మోడల్ భేష్ అని సర్వే కితాబిచ్చింది. మహిళల భద్రత కోసం ఏర్పాటు చేసిన షీటీమ్స్, రద్దీగా ఉండే ప్రాంతాల్లో పెట్రోలింగ్ భరోసా కల్పిస్తున్నాయని సర్వే ప్రశంసించింది. కొచ్చిలోని విమెన్ పోలీస్ కంట్రోల్ రూమ్‌తోపాటు షీటీమ్స్‌ను ఆదర్శంగా పేర్కొంది. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన వీహబ్ అద్భుత ఫలితాలిస్తోందని.. స్టార్టప్ ఎకోసిస్టమ్‌తో మహిళలను అనుసంధానిస్తోందని సర్వే హైలైట్ చేసింది.
మహిళలు అన్ని రకాల పరిశ్రమల్లో, షిఫ్టుల్లో పనిచేసేలా నిబంధనలను సడలించిన 5 రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటని ప్రశంసించింది. గుజరాత్‌తోపాటు హైదరాబాద్‌లోని ఫార్మా క్లస్టర్లు ప్రపంచ స్థాయి ప్రమాణాలను అందుకున్నాయని, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు అండగా నిలుస్తున్నాయని సర్వే పేర్కొంది. దేశంలోని 85% సిమెంట్ పరిశ్రమ కేంద్రీకృతమైన రాష్ట్రాల జాబితాలో తెలంగాణ అగ్రభాగంలో ఉంది. అగ్నిమాపక అనుమతుల కోసం థర్డ్‌పార్టీ సర్టిఫికేషన్‌ను అనుమతించి ఇన్‌స్పెక్టర్ రాజ్ విధానానికి స్వస్తి పలికిన రాష్ట్రంగా తెలంగాణను సర్వే గుర్తించింది.

# గద్దెపై కొలువుదీరిన సమ్మక్క

-మొదటిపేజీ తరువాయి

అమ్మవారిని అలంకరించి వారికి సంప్రదాయ పూజలు కొనసాగించారు. అనంతరం అమ్మవారి ప్రతిరూపమైన కుంకుమ భరిణెను తీసుకొని రాత్రి 10 గంటల సమయంలో గద్దెపై కొలువుదీర్చారు. అనంతరం భక్తులు అధికసంఖ్యలో చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు.
అమ్మవారిని తీసుకొస్తుండగా చిలకలగుట్ట నుంచి గద్దెల ప్రాంగణం వరకు దారికి ఇరువైపులా భక్తులు పెద్ద సంఖ్యలో చేరి 'తల్లీ సమ్మక్క... సల్లంగ చూడమ్మ' అంటూ జయజయధ్వానాలు చేశారు. మహిళలు, ఆడపడుచులు అందమైన ముగ్గులు వేసి అమ్మకు ఘన స్వాగతం పలికారు. జాతరకు సంక్రాంతి పండగ తరలివచ్చిందా అన్నట్టు దారంతా రంగవల్లులతో ముస్తాబు చేశారు. వందలాది మంది భక్తులు డోలు, డప్పు చప్పుళ్లకు లయబద్ధంగా నృత్యాలు చేశారు. కళాకారులు ఆదివాసీ సంప్రదాయ కొమ్ముబూర సంగీతంతో అందరిలో ఉత్సాహం నింపుతూ... భక్తి పారవశ్యంలో ఓలలాడారు.

**గాలిలోకి కాల్పులతో గౌరవ వందనం**

చిలుకల గుట్ట నుంచి సమ్మక్కను కిందికి తీసుకొచ్చే ఘట్టం అత్యంత ఉద్వేగభరితంగా సాగింది. అమ్మవారికి స్వాగతం పలికేందుకు మంత్రులు సీతక్క, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజరామయ్యార్, కలెక్టర్ దివాకర తదితరులు అక్కడికి చేరుకున్నారు. పూజారులు చిలకలగుట్ట దిగుతుండగానే అమ్మవారి రాకకు గౌరవసూచకంగా ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఏకే 47తో గాలిలోకి ఆనంద పారవశ్యంతో కాల్పులు జరిపారు. ఇదేరీతిలో చిలకలగుట్ట గేటు వద్ద కూడా పోలీసులు, భక్తుల జయజయధ్వానాల మధ్య రెండోసారి కాల్పులతో



హోరెత్తించారు.

**క్యూలైన్లలో రెండు గంటల సమయం...**

జాతర జనసంద్రంగా మారడంతో పోలీసులు కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టారు. ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో 25 మంది ఐపీఎస్ అధికారులు రద్దీ నియంత్రణ విధుల్లో పాల్గొన్నారు. తల్లుల దర్శనం కోసం క్యూలైన్లలో భక్తులకు కనీసం రెండు గంటల సమయం పట్టింది. మరోవైపు జంపన్నవాగు వద్ద లక్షల సంఖ్యలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. పెద్ద సంఖ్యలో తలనీలాలు సమర్పించుకొన్నారు. ఈ నేపథ్యంలో మేడారం మొత్తం గుడారాల మయమైంది.

**నేడు గవర్నర్ రాక**

శుక్రవారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ... మేడారంలో తల్లులను దర్శించుకోనున్నారు. ఈ మేరకు అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం నుంచే మేడారంలో ప్రముఖుల సందడి మొదలైంది. కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, పలువురు ఉన్నతాధికారులు తల్లులను దర్శించుకొని ఎత్తుబంగారం సమర్పించుకున్నారు

# ఇన్నోవేషన్స్.. కేరాఫ్ వింగ్స్ ఇండియా

హైదరాబాద్/సనత్‌నగర్:

హైదరాబాద్‌లోని బేగంపేట్ విమానాశ్రయంలో జరుగుతున్న వింగ్స్ ఇండియా2026 విమానయాన ప్రదర్శనలో విమానాల సాంకేతికతతోపాటు డ్రోన్లలో వచ్చిన ఆధునిక మార్పులు వావ్ అనిపిస్తున్నాయి. ఇక్కడ మల్టీరోటర్ మావీయోమ్ ఎక్స్4 డ్రోన్ ద్వారా గూగుల్ ఎర్త్‌కు సంబంధించి యూఏవీ ఫొటోలను ఎలా సేకరించవచ్చో, అగ్రికల్చర్ రీసెర్చ్ ఫారెస్ట్ ట్రాకింగ్, సర్వైలెన్స్, డిటెక్షన్, పొల్యూషన్ డిటెక్షన్, మ్యాపింగ్, మైనింగ్ ప్రాంతాల గుర్తింపు, 3డీ ల్యాండ్ మోడలింగ్ ఇలా డ్రోన్లను ఏవిధంగా ఉపయోగించవచ్చో తెలిపే వినూతన స్టాల్స్ వెలిశాయి. ఈ ప్రదర్శనలో ఐఐటీ హైదరాబాద్‌కు చెందిన తిహన్ ఇన్నోవేషన్ హబ్ అభివృద్ధి చేసిన అత్యాధునిక డ్రోన్ సాంకేతికత ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ డ్రోన్ ప్రధానంగా అటానమస్ నావిగేషన్ సాంకేతికతపై పనిచేస్తుందని తిహన్ సీనియర్ రీసెర్చర్‌గా పనిచేస్తున్న షేక్ జానీ బాషా తెలిపారు. భూమిపై నడిచే వాహనాలు, గగనతలంలో ప్రయాణించే డ్రోన్లకు స్వయంచాలక మార్గనిర్దేశం చేయడమే దీని ప్రత్యేకత. ఈ డ్రోన్‌ను ముఖ్యంగా సైనిక అవసరాల కోసం ఆయుధాలు లేదా సరుకులు రవాణా చేయడానికి రూపొందించినప్పటికీ, అవసరాన్ని బట్టి వాణిజ్య అవసరాలకూ వినియోగించవచ్చున్నారు. ఈ డ్రోన్ గరిష్టంగా 150 కిలోల బరువు మోయగల సామర్థ్యం కలిగి ఉందని చెప్పారు. 19 సీట్ల సామర్థ్యం కలిగిన హిందూస్తాన్ 228 విమానం అచ్చంగా దేశీయ తయారీ విమానం. దీనికి సంబంధించిన ప్రతి ముడి




ఉత్పత్తిని భారత్‌లోనే రూపొందించారు. విమానయాన రంగంలో సగర్వంగా భారత కీర్తిని చాటిచెప్పే ఈ విమానం వద్ద ఫొటోలు దిగేందుకు సందర్శకులు ఉత్సుకత కనబరిచారు. దీని టేకాఫ్ వెయిట్ 6,200 కిలోలు, ఫ్యూయల్ కెపాసిటీ 2,250 కిలోలు. భారత వైమానిక దళానికి చెందిన సూర్యకిరణ్ టీమ్ బృందంలో సభ్యురాలిగా ఉన్న మహిళా పైలట్ కన్వల్ సంధు, మరోపైలట్ సంజయ్‌లు వైమానిక విన్యాసాలు చేస్తూ అబ్బురపరుస్తున్నారు. విమానయాన రంగంలో మహిళలకు ఎన్నో అవకాశాలు ఉన్నాయని, యువతులు ధైర్యంగా ముందడుగు వేయాలని కన్వల్ సంధు తెలిపారు. వింగ్స్ ఇండియా2026లో శుక్ర, శనివారాల్లో సాధారణ ప్రజానీకానికి అనుమతి కల్పించారు. బుక్ మై షోలో గానీ, విమానాశ్రయంలో ఉన్న టికెట్ కౌంటర్ల వద్ద గానీ రూ.వెయ్యి చెల్లించి టికెట్ కొనుగోలు చేయాల్సి ఉంటుంది.

## కేసీఆర్‌కు నోటీసులు

-మొదటిపేజీ తరువాయి

పేర్కొన్నారు.

**నందినగర్ నివాసానికి వెళ్లి..**

నందినగర్‌లోని కేసీఆర్ ఇంటికి వెళ్లిన సిట్ అధికారులు ఈ మేరకు నోటీసులు అందజేశారు. 2024 మార్చి 10న పంజగుట్ట పోలీసుస్టేషన్‌లో ఐపీసీ, ఐటీ యాక్ట్‌తో పాటు ప్రజా ఆస్తుల విధ్వంసాల నిరోధక చట్టంలోని సెక్షన్ల కింద ఈ కేసు నమోదైంది. తొలుత ఇందులో కేవలం ఎస్ఐబీ మాజీ డీఎస్పీ దుగ్యాల ప్రణీత్‌రావు మాత్రమే నిందితుడిగా ఉన్నారు. దీని దర్యాప్తు కోసం తొలుత అనధికారిక సిట్ ఏర్పాటు చేశారు. కొన్నాళ్లకు ఈ కేసులో టెలిగ్రాఫిక్ యాక్ట్‌ను జోడిస్తూ అధికారులు న్యాయస్థానంలో మెమో దాఖలు చేశారు. అప్పటినుంచి ఫోన్ ట్యాపింగ్ కేసుగా మారింది. సిట్ బృందం ప్రణీత్‌రావుతో పాటు మాజీ అదనపు ఎస్పీలు తిరుపతన్న, భుజంగరావు, మాజీ ఓఎస్డీ రాధాకిషన్‌రావులను అరెస్టు చేసింది. మరో నిందితుడిగా ఉన్న శ్రవణ్‌రావుకు ముందస్తు బెయిల్ మంజూరు కాగా.. కీలక నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రభాకర్‌రావు ముందస్తు బెయిల్ పిటిషన్ సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉంది. గత ఏడాది వరకు సిట్ అధికారులు కేవలం కొందరు రాజకీయ నాయకులు, అధికారులు, బాధితులతో పాటు ఇతరుల్నీ విచారించారు. కాగా గత నెలలో ఈ కేసు దర్యాప్తు కోసం డీజీపీ బి.శివధర్‌రెడ్డి అధికారిక సిట్ ఏర్పాటు చేశారు. హైదరాబాద్ పోలీసు కమిషనర్ విశ్వనాథ్ చన్నప్ప సజ్జనార్‌ను దీనికి చీఫ్‌గా నియమించారు. ఆ తర్వాత దూకుడు పెంచిన సిట్ కేసీఆర్ కుటుంబీకులు, బంధువులకు నోటీసులు జారీ చేయడం మొదలెట్టింది. ఈ నెల 19న మాజీ మంత్రి హరీశ్‌రావు, 22న మరో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, 27న మాజీ ఎంపీ సంతోశ్‌రావులకు నోటీసులు జారీ చేసి సిట్ కార్యాలయంలో విచారించింది. వివిధ కోణాల్లో ప్రశ్నించడంతో పాటు వాంగ్మూలాలు నమోదు చేసింది.

**ఎర్రవల్లి నివాసంలో కుదరదు..!**

విచారణ జరిగే ప్రాంతానికి కేసు దర్యాప్తు అధికారితో పాటు మరికొందరు కూడా రావాల్సి ఉంటుందని కేసీఆర్‌కు ఇచ్చిన నోటీసుల్లో సిట్ వివరించింది. ఎర్రవల్లి నివాసంలో విచారణ కుదరదని పరోక్షంగా స్పష్టం చేస్తూ.. హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని ఓ ప్రాంతాన్ని చెప్పాలని కోరింది. ఎక్కడకు వచ్చి విచారించాలనే సమాచారాన్ని కేసు దర్యాప్తు అధికారిగా ఉన్న జూబ్లీహిల్స్ ఏసీపీ పి.వెంకటగిరికి తెలపాలని సూచించింది.

**బందోబస్తుపై పోలీసుల దృష్టి..**

కేసీఆర్‌కు సిట్ నోటీసుల నేపథ్యంలో జూబ్లీహిల్స్ పోలీసులు బందోబస్తుపై దృష్టి పెట్టారు. ఆయన జూబ్లీహిల్స్ ఠాణాకు వచ్చినా.. అధికారుల బృందం నందినగర్‌లోని ఇంటికి వెళ్లాల్సి వచ్చినా తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి పెట్టారు. గురువారం మధ్యాహ్నం ఈ రెండు ప్రాంతాలను పరిశీలించిన అధికారులు ఆయా మార్గాలతో పాటు పరిసరాలనూ గమనించారు. ఎక్కడెక్కడ పికెట్లు, బారికేడ్లు ఏర్పాటు చేయాలి? ఎక్కడ నుంచి ట్రాఫిక్ మళ్లింపులు విధించాలి? అనే అంశాలను పరిశీలించారు. కేసీఆర్ విచారణ నేపథ్యంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భారీ ఎత్తున బీఆర్ఎస్ శ్రేణులు, ఆయన అభిమానులు వచ్చే అవకాశం ఉండటంతో అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు.

**బీఆర్ఎస్ శ్రేణుల ఆగ్రహం**

ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు హాజ రుకావాలంటూ కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడంపై బీఆర్ఎస్ శ్రేణులు భగ్గుమన్నాయి. గురువారం బంజారాహిల్స్‌లోని అగ్రసేన్ చౌరస్తాలో బీఆర్ఎస్ రాష్ట్ర నేతలతో పా టు ఖైరతాబాద్ నియోజకవర్గం పార్టీ అధ్యక్షుడు మన్నె గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. దీంతో కొద్దిసేపు ట్రాఫిక్ జామ్ ఏర్ప డింది. కాంగ్రెస్ ప్రభుత్వం పాలన మరిచి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని నేతలు విమర్శించారు. మరోవైపు బీఆర్ఎస్ విద్యార్థి విభాగం ఉస్మానియా యూనివర్సిటీలో ఆందోళనకు దిగింది. వీరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు ఠాణాకు తరలించారు.

## ఆర్‌సీసీ అద్దె ఇంట్లో ఉంటే ఇందిరమ్మ బిల్లులకు బ్రేక్!



హైదరాబాద్

"పేదల్లో నిరుపేదలకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తాం.."ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించే సమయంలో ప్రభుత్వం పదేపదే చెప్పిన మాట. "ఇందిరమ్మ ఇల్లు పొందాలంటే సొంత జాగా ఉండాలి, సొంతిల్లు ఉంటే గనక కేవలం కచ్చా పైకప్పుతో కూడిన ఇల్లు మాత్రమే ఉండాలి. ఎట్టి పరిస్థితిలో ఆర్‌సీసీ పైకప్పు ఉండకూడదు"అని అర్హతల జాబితాలో స్పష్టం చేసింది. ఈ మేరకు పక్కా పైకప్పు ఉన్న ఇంటిలో ఉన్న వారి దరఖాస్తులను అధికారులు పరిగణనలోకి తీసుకోలేదు. ఇంతవరకు బాగానే ఉంది. అయితే అసలైన గందరగోళం ఇప్పుడు మొదలైంది. సొంత జాగా ఉన్నా, సొంతిల్లు లేని పేదలు అద్దె ఇళ్లలో ఉంటూ, ఆ ఇంటికి ఆర్‌సీసీ (పక్కా) పైకప్పు గనక ఉంటే.. ఇందిరమ్మ ఇంటి బిల్లులు మంజూరు చేసేందుకు గృహనిర్మాణ సంస్థ నిరాకరిస్తోంది. అలా ఆర్‌సీసీ పైకప్పు ఉన్న ఇళ్లలో అద్దెకు ఉండే వారిని ఎల్3 (అర్హతలపై అనుమానాలున్న వారితో రూపొందించిన జాబితా) జాబితాలోకి చేర్చడం చర్చనీయాంశంగా మారింది.

**ఇల్లు మంజూరు.. బిల్లుల తకరారు!**

ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజలు దరఖాస్తు చేసుకున్న తర్వాత జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో ఓ తనిఖీ బృందాన్ని ఏర్పాటు చేశారు. ఆ బృందం దరఖాస్తుల్లోని చిరునామాల వద్దకు ప్రత్యక్షంగా వెళ్లి అర్హతలను తేల్చి సిఫారసు చేసింది. ఆ సమయంలో, సొంత జాగా ఉండి, సొంత ఇల్లు లేక అద్దె ఇళ్లలో ఉండే పేదలను గుర్తించి సానుకూల నివేదికలు సమర్పించింది. ఆర్‌సీసీ పైకప్పు ఉన్న అద్దె ఇళ్లలో ఉన్నప్పటికీ, పేదలే కావటంతో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశారు. అప్పట్లో అద్దె ఇంటికి ఆర్‌సీసీ పైకప్పు ఉంటే అర్హులు కాదన్న విషయాన్ని స్పష్టం చేయ లేదు. దాంతో సిబ్బంది పట్టించుకోలేదు. ఇళ్లు మంజూరు కావ టంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించుకున్నారు. తీరా బిల్లులు మంజూరు చేయాల్సి వచ్చేసరికి ఆర్‌సీసీ పైకప్పు ఉన్న ఇళ్లలో అద్దెకుంటున్నారన్న విషయాన్ని ఎత్తిచూపు తున్నారు. బిల్లులు మంజూరు చేయడం లేదు.

**అప్పుడే చెప్పి ఉంటే సరిపోయేది..**

ఆర్‌సీసీ పైకప్పు (పక్కా ఇల్లు) ఉన్న ఇంటికి అద్దె కాస్త ఎక్కువే ఉంటుంది. ఆ కిరాయిని భరించే స్తోమత ఉందంటే నిరుపేదల్లో నిరు పేద అయి ఉండరు అన్నది ఇప్పుడు అధికారుల అభ్యంతరానికి కారణం. అయి తే దీన్ని ముందుగానే చెప్పి ఉంటే ఏ గొడవా ఉండేది కాదు. తీరా ఇళ్లు నిర్మించుకున్నాక బిల్లులు మంజూరు చేయక పోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది. అధికారుల చుట్టూ తిరుగుతూ బిల్లులు మంజూరు చేయాలని కోరుతున్నా ఫలితం ఉండటం లేదు. ఈ విషయంలో తాము సొంతంగా నిర్ణయం తీసుకోలేమని, ప్రభుత్వం ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నామని అధికారులు చెబుతున్నారు. అయితే ప్రభుత్వం ఎటూ తేల్చకపోవటంతో అలాంటి లబ్ధిదారుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది.

